జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 3-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 414 పేజీలు: 4 వెల : రూ.7

## పీఎం కిసాన్.. అన్నదాత సుఖీభవతో..

# రైతుల్లో ఆనందం

* ఈ పథకంతో ప్రతి సెంటు భూమి సాగులోకి * జిల్లాలో 2,79,100 మంది రైతులకు 186 కోట్ల లబ్ధి * జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు * రైతులకు చెక్కుల పంపిణీ * డ్రోన్లు, వ్యవసాయ యాంత్రీకరణ పనుల పరిశీలన



**లావేరు/ శ్రీకాకుళం, ఆగస్టు 2(వార్త):** పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకం అమలుతో రైతులలో ఆనందం వెల్లి విరుస్తోందని ఎంఎస్ఎంఈ, ఎన్నారై, సెర్ప్ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం లావేరు మండలం బొడ్డపాడు గ్రామంలో పిఎసిఎస్ గోడౌన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు బాగుపడాలని, రైతే రాజు కావాలని ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద మూడు విడతలగా 6000 రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం 14 వేల రూపాయలు కలిపి 20వేల రూపాయలను రైతుకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. మొదటి విడతగా శ్రీకాకుళం జిల్లాలో రెండు లక్షల 79 వేల ఒక వందమంది రైతులకు 186 కోట్ల 13 లక్షల 2000 రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఈక్రాప్ నమోదు తర్వాత కౌలు రైతులకు కూడా ఈ లబ్ధి చేకూరుస్తామని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాకుండా సబ్సిడీపై విత్తనాలు ఎరువులు అందించడం జరుగుతుందని, అవసరాల గుణంగా వ్యవసాయ శాఖ సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి పంట కుంటున్నామని వారికి 48 గంటల్లోనే సొమ్ము చెల్లిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 10 లక్షల కోట్ల లోటు బడ్జెట్ తో అప్పగించినప్పటికీ ఎన్నికల హామీల అమలులో భాగంగా పింఛన్ల పై మొదటి సంతకం చేయడం ద్వారా పదివేల కోట్ల అదనపు భారం పడినప్పటికీ అన్ని సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి వారణాసిలో, ముఖ్యమంత్రి ప్రకాశం జిల్లా దర్శి లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో లావేరు మండలం బొడ్డపాడు లో ఇన్చార్జి మంత్రివర్యులు చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభోత్సవం జరగడం ఆనందకరమన్నారు. పది సెంట్లు పైబడి భూమి ఉన్న ప్రతి రైతుకు పీఎం కిసాన్- అన్న దాత సుఖీభవ పథకం కింద లభించే కొట్టడం జరుగుతుందన్నారు. అర్హతలు ఉన్నప్పటికీ లబ్ధి పొందని వారు, ఈ పథకం వర్తించని వారు రేపటినుండి సంబంధిత సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పరిష్కార చర్యలు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా రైతులందరూ పీఎం ఫసల్ బీమా యోజన పథకం క్రింద నామమాత్రపు రుసుమ చెల్లించి బీమా సౌకర్యం పొందాలని సూచించారు. స్థానిక ఎచ్చెర్ల శాసనసభ్యులు ఎన్ ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం తన సొంత నియోజకవర్గంలో ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. రైతులను రాజులను చేయాలి అనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రైతులకు అనేక రాయితీలు కల్పిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 60శాతం పైగా వ్యవసాయం చేస్తున్నారని, పరిశ్రమలను కూడా ఏర్పాటుచేసే ఆలోచనతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని 48, 103 మంది రైతులకు రూ. 31,89,89,000ల విలువ గల చెక్కును పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం కింద మంత్రివర్యులు చేతుల మీదుగా అందజేశారు. ముందుగా రైతుల వినియోగిస్తున్న మెకనైజ్డ్ యంత్ర పరికరాలను, డ్రోన్లను పరిశీలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మద్ అహ్మద్ ఖాన్, సహాయ కలెక్టర్ (ట్రైనీ) డి పృథ్వీరాజ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, రాష్ట్ర మహిళా కార్యదర్శి సుజాత, నాలుగు మండలాల ఎంపీపీలు, ఎంపీడీవోలు, తాసిల్దార్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, జనసేన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.













## ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి



**సరుబుజ్జిలి, ఆగస్టు 2(వార్త):** గడిచిన 11 నెలలుగా ఎటువంటి నిధులు అందడం లేదని సరుబుజ్జిలి పంచాయతీ సర్పంచ్ బొడ్డేపల్లి చాందిని వెంకట సూర్య వాపోయారు. గ్రామంలో చిన్న సమస్య తలెత్తినా సొంత సొమ్ముతో ఖర్చు చేసి పనులు చేస్తున్నామన్నారు. వాస్తవానికి 15వ ఆర్థిక సంఘం నిధులు పంచా యతీలకు జమ కావలసిన ఉండగా అలా జరగలేదన్నారు. దీంతో పారిశుధ్యం, ఇతర అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు.

రానున్న వర్షాకాలంలో గ్రామంలో అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తే కొంతమేర సమస్యలు అధిగమించేలా వెసులుబాటు లభిస్తుందన్నారు.

# వైసీపీ డీఎన్ఏలోనే నీచ సంస్కృతి

**-మహిళలను కించపరిచే వారికి పరామర్శలా?**

**-తల్లి, చెల్లికి అన్యాయం చేసినవాడు రాష్ట్రాన్ని బాగుచేస్తారా?**

**-జగన్‌పై ఎమ్మెల్యే గౌతు శిరీష మండిపాటు**

**పలాస, ఆగస్టు 2(వార్త):** మహిళలను కించపరచిన ప్రసన్నకుమార్ రెడ్డిని పలకరించడానికి వెళ్లిన జగన్మోహన్ రెడ్డి నిజ స్వరూపం మరోమారు బయటపడిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నిప్పులు చెరిగారు. పలాసలోని ఆమె కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వరుసకు సోదరి అయ్యే ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు వెళ్లిన జగన్‌రెడ్డి నైతికత ఇట్టే అర్థమవుతోందన్నారు. ఇప్పటికే కోర్టు కూడా ఆయనపై అక్షింతలు వేసినట్లు గుర్తు చేశారు. ఆయన నిజాయితీ, నీతిని జగన్‌రెడ్డి, సాక్షి ఛానెల్‌లే మాట్లాడాలని ఎద్దేవా చేశారు. రాజకీయరంగంలోని మహిళలపై అత్యంత అసభ్యకరంగా నీచాతినీచంగా సోషల్‌మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడిన వైసీపీ నేతలను ఉదహరించారు. ఈ విష సంస్కృతి ఎక్కడ్నుంచి మొదలయ్యిందో ప్రజలకు ప్రత్యేకంగా చెప్పక్కర్లేదని నిట్టూర్చారు. వైసీపీ గద్దెనెక్కినప్పట్నుంచి ఈ తరహా నీచ సంస్కృతిని పెంచి పోషించారని దుయ్యబట్టారు. తమ నేత చేసిన పనికి పరామర్శించడానికి సిగ్గుండాలని సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ఏముందని ప్రశ్నించారు. ప్రజావేదిక కూలదోతతో మొదలైన అరాచకాలు ఐదేళ్లపాటు కొనసాగించారని, ఇదేమిటని ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయించారని, మీడియా సంస్థలను అణచివేసేందుకు కుట్రలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలంతా ఏకమై చెప్పుతో కొట్టినట్టు 11 సీట్లకు పరిమితం చేసి, గర్వభంగం చేశారన్నారు. అసెంబ్లీకి రాకుండా పాతపాటే పడుతూ అబద్ధాలతో ప్రజల్లోకి వెళ్లడానికి ప్రయత్నిస్తున్న వైసీపీ నాయకులను ప్రజలు ఛీకొట్టే రోజులు పోయి చెప్పుతో కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సంజన.. సుకన్య... గంట.. అరగంట... అంటూ అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడిన అంబటి రాంబాబు, అవంతి శ్రీనివాస్‌లకు మంత్రి పదవులిచ్చి మహిళలపై మీకున్న స్టాండ్ ఏమిటో ఆనాడే అర్థమయ్యిందని, అటువంటి వారందరికీ వెన్నుతట్టి ప్రోత్సహించిన వ్యక్తి జగన్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. తల్లి మీద చెల్లి మీద కోర్టులకు వెళ్లి వారికి ఆస్తుల నివ్వకుండా.. తన విజయంగా తన సొంత పత్రికల్లో రాయించుకున్న వ్యక్తి జగన్ అని ధ్వజమెత్తారు. ఈ తరహా వ్యక్తిత్వమున్న జగన్‌రెడ్డి. మహిళలకు ప్రాధాన్యతనిస్తున్నారని, వారికి విలువనిస్తున్నారని ప్రకటనలు గుప్పిస్తోన్న వైసీపీ మహిళా నేతలంతా తలదించుకోవాలని వ్యాఖ్యానించారు. మీ పార్టీ హయాంలో మంత్రులుగా పనిచేసి.. మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినవారి వీడియో, ఆడియో సంభాషణలు చూస్తే పరిస్థితి తేటతెల్లమవుతుందని వైసీపీ మహిళా నేతలకు చురకలంటించారు. సొంత చెల్లి పసుపు చీర కట్టుకుందని తన కోసం శ్రమించిన ఆ వ్యక్తి అసలు తన తండ్రికే పుట్టలేదని గతంలో జగన్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరైనదేనా, తన తల్లిని అవమానించిన వ్యక్తి మీకు నాయకుడా అటువంటి వ్యక్తికి వత్తాసు పలుకుతారా అంటూ అసహనం వ్యక్తంచేశారు. తల్లి వయసున్న నారా భువనేశ్వరిపై వైసీపీ నాయకులు అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తుంటే వారిని వారించాల్సింది పోయి.. ముసిముసి నవ్వులు నవ్వుతూ ప్రోత్సహించడం ఆయనలోని రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ఈ తరహా సంస్కృతిని సృష్టించడంతో పాటు పెంచి పోషిస్తూ మరింత ముందుకు తీసుకెళ్తోందని వైసీపీ అని మండిపడ్డారు. మాజీ సీఎం సతీమణి భారతి



రెడ్డిపై టీడీపీ కార్యకర్త పరుషపదజాలం వినియోగిస్తే, ఆయన్ని చంద్రబాబే అరెస్టు చేసిన సంఘటనను గుర్తుచేశారు. అదీ టీడీపీ నైతికత అని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత హెూంమంత్రి అని తను, తనను ఎంతో మానసికంగా హింసించినట్లు గుర్తుచేసుకున్నారు. ఇక భారతి రెడ్డి గురించి మాట్లాడాలంటే తనకు అసహ్యం వేస్తుందని, ఆమె వ్యక్తిగత కార్యదర్శి రవీందర్ రెడ్డి ఎలాంటి పోస్టులు పెట్టాడో నేటికీ సోషల్ మీడియాలో ఉన్నాయన్నారు. పాదయాత్రలకు, పరామర్శలకు జగన్‌రెడ్డికి ఓ కారణం అవసరమని, గతంలో నందన్ సుబ్బయ్య, తోట చంద్రయ్యని పట్టపగలు రోడ్డుపై అతి కిరాతకంగా చంపిన వారిని, ఆడపిల్లల్ని పొడిచి చంపిన నేరస్థులను కూడా పరామర్శలకు వెళ్తారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చురకలంటించారు. ముఖ్యంగా స్త్రీలపై గత ఐదేళ్లలో చేసిన అరాచకాలు ఎన్నటికీ మర్చిపోలేమని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను మహిళాలోకం సహించదన్నారు. అలాగే కల్లబొల్లి కథనాలను సాక్షి ప్రచారం చేస్తోందని, పాత క్లిప్పింగులను జోడించి, ప్రస్తుత జగన్‌రెడ్డి పర్యటనలకు జోడిస్తోందని ఆరోపించారు.

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**సరుబుజ్జిలి, ఆగస్టు 2(వార్త):** సరుబుజ్జిలి జంక్షన్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పోషక ఆహారం, గర్భిణలు ఏ ఆహారం తీసుకోవాలో వివరించారు. పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఎంతో పౌష్టికాహార మని, తల్లిపాలు అలవాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రేడ్‌వన్ సూపర్‌వైజర్ అమ్మనమ్మ, హాస్పిటల్ సిబ్బంది కె.శైలజ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

**బూర్జ, ఆగస్టు 2(వార్త):** బూర్జ పరిధి రొట్టవలస కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ పరిశీలకులు జానకిలక్ష్మి అధ్యక్షతన తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. తల్లులకు తల్లిపాలలో ఉండే పోషకాలు, బాలింతలకు పాలిచ్చే సమ యంలో



తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్య కర్త విశాలాక్షి, సహాయకురాలు విజయ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వనజాక్షి, తల్లులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అన్నదాతలకు అండగా ప్రభుత్వం

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**-రైతులకు అన్నదాత సుఖీభవ నిధుల చెక్కు అందజేత**

**జలుమూరు, ఆగస్టు 2(వార్త):** లింగాలవలస పంచాయతీలో అన్నదాత సుఖీభవ నిధులను లబ్ధిదారులైన రైతులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ 6 పథకాల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని, మూడు దఫాలుగా ఏడాదికి రూ.20,000లను రైతుల ఖాతాలో జమ చేసేలా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జగన్ పాలనలో నిర్లక్ష్యం చవిచూసిన రైతుకు ఇప్పుడు చంద్రన్న పాలనలో భరోసా లభిస్తోందని, రైతులకు అందిస్తున్న సహాయం రైతుకు ఇచ్చే గౌరవంగా కూటమి ప్రభుత్వం భావిస్తుందని, రైతన్న ఖాతాలోకి నేరుగా నిధులు జమ చేయడం కూటమి ప్రభుత్వ అవినీతి రహిత పాలనకు నిదర్శనమని అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి కష్టం లేకుండా ప్రతి విషయం పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని, రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను కూటమి ప్రభుత్వం అమలు




చేస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణమనాయుడు, జలుమూరు, పోలాకి మండలాల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, చల్లవానిపేట, అల్లాడ, పోలాకి పీఏసీఎస్ అధ్యక్షులు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణ్, భైరి భాస్కరరావు, సర్పంచులు బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, కింజరాపు సత్యనారాయణ, సూరపు నారాయణదాసు, సింహాచలం, రెడ్డి జయరాం, కొబగాపు వెంకట్రావు, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయం సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మోదీ ప్రభుత్వంలో రైతే రాజు

**పలాస, ఆగస్టు 2(వార్త):** ప్రధాని మోదీ పరిపాలనలో రైతే రాజుని పలాస బీజేపీ నాయకులు అన్నారు. శనివారం వారు పలాసలో విలేఖరులతో మాట్లాడారు. మోదీ పీఎం కిసాన్ యోజన ద్వారా దేశంలో 9.7 కోట్ల రైతుల రైతు ఖాతాల్లో 20వ విడత నిధులు జమ చేశారన్నారు. రాష్ట్రంలో సుమారు 46 లక్షల మంది రైతులు ఇందులో ఉన్నారన్నారు. రైతులకు సబ్సిడీతో ఎరువులు, యంత్ర పరికరాలు, రుణాలు అందజేస్తున్నారన్నారు. రైతుల అభివృద్ధి బీజేపీ ప్రభుత్వంలోనే సాధ్యమవుతుందన్నారు. రైతులకి మద్దతు ధర కల్పించారన్నారు. రైతే రాజు అనే నినాదంతో మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ సీనియర్ నాయకులు రామానంద్ స్వామి, మాజీ టౌన్ ప్రెసిడెంట్ వైశ్య రాజు మోహన్‌రాజ, పలాస రూరల్ మండల అధ్యక్షుడు మావిడి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనసారలో పింఛన్ల పంపిణీ



**భామిని, ఆగస్టు 2(వార్త):** ఘనసార గ్రామ పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా నూతనంగా మంజూరైన ఐదు వితంతువు పెన్షన్లను కూటమి నాయకులు లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన నాటినుంచి అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, సచివాలయ ఉద్యోగులు ద్వారా తమ ఇంటి వద్దకే పెన్షన్ అందజేస్తున్నారని, ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఘనసార ఉప సర్పంచ్ కూడంగి పాపారావు, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మడపాన అనిల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు నేర్జి శ్రీనివాస్‌రావు, కళ్యాణి సీతారామ్, కిల్లారి శంకర్రావు, అరిక సూరయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ అక్కిరాజు, సెక్రటరీ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి



**మందస, ఆగస్టు 2(వార్త):** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు మరింత పారదర్శకంగా జరగాలని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. మందసలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు జరగడానికి కొత్తగా వచ్చిన అటెండెన్స్ విధానంలో ఫేస్ ఆథారైజేషన్ ద్వారా హాజరు పంపిస్తామన్నారు. పనుల గుర్తింపు కోసం జియో ట్యాగింగ్ విధానంపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు బీవీ హరికృష్ణ, శంకర్, ఈసీలు చింతా సురేష్ వర్మ, అమ్మినాయుడు, ప్రకాష్, వెంకటరమణ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆఫ్‌లైన్‌లోని పని చేస్తాం

**-ఐసీడీయస్ ఫోన్లు తిరిగి అప్పగించేసిన అంగన్‌వాడీలు**

**పలాస, ఆగస్టు 2(వార్త):** ఐసీడీయస్ ఈ నెల 4న ఇచ్చిన సెల్‌ఫోన్లు తిరిగి ఇచ్చేస్తున్నామని తెలియజేస్తూ ఐసీడీయస్ అధికారులకు మెమోరాండం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కాశీబుగ్గ ప్రాజెక్ట్ కమిటీ తరపున శనివారం అందజేశారు. ఆన్‌లైన్ వర్క్ చేయాలంటే 5జీ నెట్‌వర్క్ కలిగిన ట్యాబ్‌లు గానీ, సెల్ ఫోన్లు గానీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఆఫ్‌లైన్‌లోనే వర్క్ చేస్తామని తెలిపారు. యూనియన్ నాయకులు డి.సునీత, పి.పద్మావతి, ఆర్.అరుణ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## అక్రమంగా తరలిస్తున్న గేదెల పట్టివేత

**మందస, ఆగస్టు 2(వార్త):** ఎటువంటి అనుమతి లేకుండా తరలిస్తున్న ఐదు గేదెలను మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ శనివారం పట్టుకున్నారు. ఏపీ 39 యూహెచ్ 1767 అనే నంబరు గల వాహనంలో కనీసం పశువులు నిలబడడానికి కూడా వీలులేని విధంగా తీసుకెళ్తుండగా.. మఖరజోల గ్రామం వద్ద, వాహనాన్ని నిలిపి స్వాధీనం పరుచుకున్నారు. వీటిని గుజ్జలవలస గోశాలకు అప్పజెప్పడం జరిగిందని ఎస్ఐ చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.








## పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభకు జిల్లా స్థాయిలో గుర్తింపు

**పలాస, ఆగస్టు 2(వార్త):** శ్రీకాకుళం పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. వ్యాసరచనలో బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థినులు ఎం.పూజిత ద్వితీయ, ఇప్పిలి చామంతి తృతీయ బహుమతి పొందారు. క్విజ్ పోటీలో కళాశాలకు తృతీయ స్థానం లభించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి విజేతల్ని అభినందిస్తూ, విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో కూడా కళాశాలకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు కూడా విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

## బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ విజయవంతం



**పలాస, ఆగస్టు 2(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 18వ వార్డులో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం విజయవంతమైంది. చంద్రబాబు ఎన్నికల్లో గెలవడం కోసం ప్రజలకు ఎన్నో సాధ్యం కాని మోసపురితమైన హామీలు ఉచ్చి పదవిలోకి వచ్చారని, కానీ సీఎం అయిన తరువాత ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలకు ఏవిధంగా వెన్నుపోటు పొడిచాడనే విషయం ప్రజలకు రచ్చబండ కార్యక్రమం ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపీ, వైస్సార్సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు మునిసిపల్ సీనియర్ కౌన్సిలర్ గుజ్జు జోగారావు, మునిసిపల్ వైస్ చైర్మన్ బోర బుజ్జి, 18వ వార్డు కౌన్సిలర్ వైస్సార్సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు సనపల సింహాచలం, 5వ వార్డు కౌన్సిలర్ పట్టణ ప్రధాన కార్యదర్శి కర్రి మాధవరావు వైస్సార్సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు నర్తు వెంకటరమణ, వైస్సార్సీపీ పట్టణ యువజన అధ్యక్షుడు పోతనపల్లి హరిప్రసాద్, వైస్సార్సీపీ పలాస నియోజకవర్గం ఉద్యోగులు, పింఛనుదార్లు అధ్యక్షుడు కంచరాన చిన్నబాబు, వైస్సార్సీపీ పలాస నియోజకవర్గం ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

## పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 2(వార్త):** ఇచ్ఛాపురంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి వేడుకలు స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కే.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ, శాంతి, జయలక్ష్మి, మీనా, సరోజిని, పార్వతి, స్నేహ, ప్రమీల, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియ, సెక్రటరీ డి. హర్షవర్ధన్ రెడ్డి, ఎస్.పి.ఎల్. జిహారిక, యువశ్రీ పాల్గొన్నారు. జ్ఞానభారతి సీనియర్ సెకండరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల సెక్రటరీ, సీఈవో జోహార్‌ఖాన్ పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఐబీ పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



# అత్త తిట్టిందని అల్లుడి ఆత్మహత్య

**-మెట్టూరు గ్రామంలో విషాదఛాయలు**

**కొత్తూరు, ఆగస్టు 2(వార్త):** మెట్టూరు బిట్-2 గ్రామానికి చెందిన పెదకోట గోవిందరావు(49) గురండి-నేరడి గ్రామాల మధ్య ఉన్న తోటలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి భార్యకు ముగ్గురు సోదరీమణులు ఉండగా, వారి తల్లి నలుగురిళ్లలో ఒక్కొక్క నెల చొప్పున ఉంటూ వస్తోంది. తాజాగా ఆమె మృతుడి ఇంటికి వచ్చిన సమయంలో, గతంలో మాదిరిగానే కుటుంబసభ్యుల మధ్య మాటా.. మాటా పెరిగి గొడవ తారాస్థాయికి చేరింది. "నువ్వు నా ఆస్తంతా తినేశావు" అంటూ అత్త చేసిన వ్యాఖ్యలతో అల్లుడు గోవిందరావు తీవ్ర మనోవేదనకు గుంయ్యారు. దీంతో ఆయన ఇంటినుంచి బయటకు వెళ్లి, కొద్దిసేపటికి తోటలో ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.



# మరో హామీ నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

**-టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు,**

**మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ**

**కొత్తూరు, ఆగస్టు 2(వార్త):** ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో మరో హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసిందని టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన మాతలలో విలేఖరులతో మాట్లాడారు. ఈ పథకం కింద ప్రతి రైతన్నకు ఏడాదికి రూ.20,000 ఆర్థిక సహాయం అందించనుండగా, మొదటి విడతలో కేంద్ర ప్రభుత్వం 2,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000 కలిపి మొత్తం రూ.7,000 రైతుల ఖాతాలో జమ చేసిందన్నారు. రైతన్నలకూ పెట్టుబడి కోసం ప్రత్యక్ష మద్దతు అందించిందన్నారు. చేనేత కార్మికుల కోసం ప్రభుత్వం మరో ముందడుగు వేయనుందన్నారు. ఈ నెల 7 నుంచి రాష్ట్రంలోని చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ అమలు చేయనుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజధాని నిర్మాణం కొనసాగుతుండగా, మరోవైపు పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడేలా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రపంచ స్థాయి కంపెనీలతో పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్, మంత్రివర్గ సభ్యులు, ఉన్నతాధికారులతో కలిసి సింగపూర్ పర్యటనలో భాగంగా వేల కోట్ల పెట్టుబడు లను రాష్ట్రానికి రప్పించేందుకు చర్చలు జరిపారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ప్రజలకు అన్ని రంగాలలో శ్రేయస్సు కలిగించేలా చర్యలు తీసుకుంటుందన్నారు.



## ధర్మస్థలి నేరాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో విచారణ జరపాలి

**-పిఓడబ్ల్యు, శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి**

**పోతనపల్లి కుసుమ డిమాండ్**

**పలాస, ఆగస్టు 2(వార్త):** ధర్మస్థలి నేరాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలో ఉన్నత స్థాయి దర్యాప్తు చేపట్టాలని, దోషులందరిని కఠినంగా శిక్షించాలని, తక్షణమే సాక్షి రక్షణ, ఫిర్యాదుదారులందరికీ, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని ప్రగతిశీల మహిళా సంఘం శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ డిమాండ్ చేశారు. శనివారం బొడ్డపాడులో ఆమె విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ధర్మస్థలి ఆలయంలో 1995 నుంచి 2014వరకు పనిచేసిన మాజీ పారిశుధ్య కార్మికుడు అనేకమంది అత్యాచార ఆనవాళ్లు ఉన్న బాలికల, మహిళల శవాల్ని తాను నేత్రావతి నదీ పరీవాహక ప్రాంతంలో పూడ్చిపెట్టాడని తెలిపాడన్నారు. ఆలయ ట్రస్టీ చాలా రాజకీయ, అధికార, డబ్బు పలుకుబడి గల వారని, ఎన్ని ప్రభుత్వాలు మారినా అందరిని మేనేజ్ చేయగలరని, బాలికలు, మహిళలు మిస్సింగ్ విచారణలపై వార్తలు రాకుండా కోర్టు ఆర్డర్ కూడా తెచ్చారని, తాను భయపడి ఆ నేరంలో భాగం కాలేక పారిపోయానని, పాపభీతి వెంటాడుతుండటంతో ఇప్పుడు బయట పెడుతున్నానని తెలియజేశాడన్నారు. ఈ విషయాన్ని ఆయన విశ్రాంత సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ గోపాల్‌గౌడ్, పత్రికల వారి సమక్షంలో చెప్పాడన్నారు. తాను పూడ్చిపెట్టిన అమ్మాయి తాలుకా ఎముకలు తీసు కొని వెళ్లి చూపించి ఇతర ఆధారాలను కూడా చూపిస్తాను రమ్మనమని పదే పదే పోలీసులను కోరాడని ఆమె చెప్పారు. టెంపుల్‌టౌన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసు వారు వెంటనే ప్రాథమిక సాక్ష్యాధారాల్ని సేకరించుకొని, సాక్ష్యాల్ని రక్షించాల్సిన వారు ఆ పని చేయడం లేదని, పైగా ఫిర్యాదుదారునికి బ్రెయిన్ మ్యాపింగ్ టెస్ట్, నార్కోటెస్ట్‌లు, ఫింగర్ ప్రింట్ టెస్ట్‌లు చేసుకుంటూ కాలం గడుపు తున్నారని ధ్వజమెత్తారు. న్యాయవాదులు, ప్రజలు ఆందోళన చేసిన తరువాత మాత్రమే సిట్ వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి కూడా కాలపరిమితిని విధించలేదని, గతంలో మిస్ అయిన యువతుల తల్లిదండ్రులను ఆలయ ట్రస్టీ బాధ్యులు తిట్టి దాడి చేసి పంపించారని, వారు మళ్లీ వచ్చి ఫిర్యాదు చేస్తున్నారన్నారు. ఈ ఘటనలు ఒక ధర్మానికో, మతానికో సంబంధించినవి కావు. మహిళలపై బాలికలపై జరిగిన సామూహిక అత్యాచారాలు, హత్యలు, సామూహిక దహనాలు, ఖననానికి సంబంధించిన విషయం కాదన్నారు. ఇటువంటి ఆరోపణలు ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదని, గతంలో వచ్చిన వార్తలకు అత్యంత ప్రభావితమైన ఆలయ ట్రస్టీలు కోర్టులో గ్యాగ్ ఆర్డర్స్ తెచ్చి వాస్తవాలను ప్రచారం కాకుండా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా వారి ప్రభావంతోనే దర్యాప్తు నత్తనడక నడుస్తుందని, గత ఫిర్యాదుల్ని దృష్టిలో పెట్టుకొని సుప్రీంకోర్టు సుమోటోగా ఈ విషయాన్ని తీసుకొని, దర్యాప్తునకు ఆదేశించి ఉంటే వెంటనే ఉపయోగం ఉండేదన్నారు. ఇప్పటికే చాలా కాలాతీతం అయ్యిందని, ఇప్పటికైనా కోర్టులు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సాక్ష్యాల రక్షణ చేపడుతూ, అన్ని అవశేషాల్ని వెలికి తీయాలని, ఆ కాలంలో తప్పిపోయిన అమ్మాయిల కుటుంబసభ్యుల ఫిర్యాదులపై సమగ్రంగా విచారించాలని పోలీసుల్ని ఆదేశించాలని కోరారు. ఫోర్సెనిక్ నిపుణుల బృందంతో శాస్త్రీయ దర్యాప్తు జరపాలని, ఫిర్యాదుదారునికి, సౌజన్య తల్లికి, న్యాయవాదులకు భద్రత, రక్షణ కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు.



# ప్లాస్టిక్ నియంత్రణ మనందరి బాధ్యత

**-ప్లాస్టిక్ నివారణకు సహకరించండి**

**-గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్**

**పలాస, ఆగస్టు 2(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కాశీబుగ్గ పాత బస్టాండ్, ఎండీఓ ఆఫీస్, పాత ఎన్‌హెచ్ 5 పెట్రోల్ బంక్, వివిధ వార్డుల్లో ప్లాస్టిక్ వినియోగం బాగా పెరిగిపోయిందని, వినియోగించిన ప్లాస్టిక్ విచ్చలవిడిగా రోడ్ల పైన వేస్తున్నారని, దీంతో జల, వాయు, కాలుష్యం పరిసరాలు అపరిశుభ్రముగా తయారవుతున్నాయని, ప్లాస్టిక్ తిని పశువులు అనారోగ్యానికి గురవుతున్నాయని, ప్లాస్టిక్ నియంత్రణ మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ గ్రీన్ ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్ శనివారం పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం అనేది నిత్యజీవితంలో ఒక భాగం అయిపోయిందని, ప్రజలు, యువత, వివిధ స్వచ్ఛంద సంస్థలు వీటి వినియోగం వల్ల నష్టాలు తెలుసుకొని ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలందరూ భాగస్వామి అయి గ్రీన్ పలాసగా క్లీన్ పలాసగా.. మీ వంతు సాయం అందించాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగంపై టాస్క్‌ఫోర్స్ టీం ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలను అధిగమించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ ఉపాధ్యక్షులు పొట్నూరు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మోస హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రోడ్డు మలుపులు వద్ద ప్రమాదాలు నివారించండి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 2(వార్త):** ఇచ్ఛాపురం ప్రవేశ ద్వారం వద్ద బహుదా నది వంతెనకు సమీపంలో గల రోడ్డు మలుపులో చెట్లు, ముల్ల పొదలతో అటునుంచి ఇటుగా ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరగా వచ్చేవరకు కనపడడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం కలదు. ఆ చెట్లు తొలగించి, లైటింగ్ ఏర్పాటు, స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని సీడప్ మాజీ చైర్మన్ సాడి శ్యాం ప్రసాద్‌రెడ్డి కోరారు. పోలీస్ శాఖ, ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని విన్నవించారు.



## లబ్ధిదారులు లేకుండానే అంగన్‌వాడీ సరుకుల పంపిణీ

**-అంగన్‌వాడీ కార్యకర్తల ఇష్టారాజ్యం**

**-పట్టించుకోని అధికారులు**

**(సరుబుజ్జిలి)**

అంగన్‌వాడీ సరకులు పంపిణీ చేయాలంటే లబ్ధిదారులను పిలిపించి, బరువు తూచి, సమయానికి అందవలిసిన టీకాలు అందుతున్నాయా లేదా చూడాలి. కానీ సరుబుజ్జిలి పరిస్థితి అందుకు విభిన్నం. పిల్లలు, గర్భిణులు ఎక్కడ ఉన్నా ఇక్కడ రేషన్ పంపిణీ జరుగుతుంది. లబ్ధిదారుల సంరక్షకులు కూడా అవసరం లేదు. వారికి ఏదోవిధంగా దూరం రిలేషన్ అయినా ఫరవాలేదు. ఇంత జరుగుతున్నా సరుబుజ్జిలి పీవో గీత మాత్రం మాకెందుకులే అనే ధోరణిలో ఉంటుంది. కార్యకర్తలు చెప్పినట్లు గీత నడుచుకుంటుంది. ఎందుకంటే ఎవరికి అందాల్సింది వారికీ అందు తుంది. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించమని పలుమార్లు పలువురు ప్రశ్నించినా ఆమె ఆఫీస్ నుంచి కాలు కూడా కదపడం లేదు. ఇలా అధికారులు ఎవరికి వారు, బాధ్యత తీసుకోకపోతే వ్యవస్థ మారేదెప్పుడు.





## సత్తా చాటిన 'ఆదిత్య' విద్యార్థులు

**-కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన యువకులు**

**-ముగ్గురికి అభినందనలు వెల్లువ**

**మందస, ఆగస్టు 2(వార్త):** మందస మండలంలోని బాలిగాం గ్రామం వద్ద గల ఆదిత్య విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చూపి, కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ముగ్గురు విద్యార్థులకు కానిస్టేబుల్స్ ఉద్యోగాలు వచ్చాయని ప్రిన్సిపాల్స్ బొంగి ప్రవీణ్, మార్పు హరికృష్ణప్రసాద్ చెప్పారు. బాలిగాం గ్రామానికి చెందిన చమళ్ల వంశీ, సురేశ్చంద్ర పట్నాయిక్, జిల్లుండ గ్రామానికి చెందిన సర్తి మురళీ ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిగ్రీ వరకు చదువుతూ కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు ఎంతో శ్రమించారు. డిగ్రీ పూర్తి చేసిన అనంతరం ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్స్ నోటిఫికేషన్ కు దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కొక్క మెట్టు దాటుతూ.. రెండు రోజుల క్రితం విడుదలైన పోలీసు కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు వంశీ, మురళీ, సురేష్ ఎంపికయ్యారు. ఒకేసారి ముగ్గురు విద్యార్థులు మూడు కానిస్టేబుళ్ల ఉద్యోగాలకు తమ కళాశాల విద్యార్థులు సాధించడంలో ప్రిన్సిపల్స్ బొంగి ప్రవీణ్, మార్పు హరి కృష్ణప్రసాద్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## ఎన్నో ఏళ్ల నాటికల తీరిన వేళ ..!

**-రూ. పది లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శిరీష శంకుస్థాపన**

**పలాస, ఆగస్టు 2(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు పురుషోత్తపురం వేణుగోపాలస్వామి ఆలయం వద్ద వార్డ్ కౌన్సిలర్ సప్త అమ్మోజి, కౌన్సిలర్ ప్రతినిధి సప్పనీవీన్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్ల పనులకు పలాస ఎమ్మెల్యే గౌత శిరీష శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధికి కొదవు లేదని, అందులో భాగంగానే పలాస నియోజకవర్గంలో గల మున్సిపాలిటీలోని మారుమూల వార్డులు కూడా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని, అప్పటి పాలకులు చేసిన పాపం ప్రజలకు శాపంగా మారిందన్నారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామాల్లో సైతం రోడ్లు, కాలువలు, సామాజిక భవనాలు పనులు జరిగి ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయంటే అది కేవలం ఒక టీడీపీకే సాధ్యపడుతుందన్నారు. కౌన్సిలర్ ప్రతినిధి సప్ప నవీన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నాటి వార్డు ప్రజల కల నెరవేరిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష కు వార్డు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. వార్డుల్లో ఎక్కడ ఏ సమస్యలు ఉన్నాయని చెప్పిన వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చేసిన ఎమ్మెల్యే శిరీష అన్నారు. కార్యక్రమంలో ఏపీటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు, ఏఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, గురుటి సూర్యనారాయణ, లోడగల కామేష్ యాదవ్, దువ్వాడ శ్రీకాంత్, పీరు కట్ల విట్టల్ రావు,బడ్డ నాగరాజు, డొక్కర శంకర్రావు, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, కాంట్రాక్ట్ మూల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## అన్నదాతా సుఖీభవ నిధులు విడుదల



**ఇచ్ఛాపురం, ఆగస్టు 2(వార్త):** ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలో ఉన్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో భాగంగా మొదటి విడత నిధులు విడుదలయ్యాయని వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ చెప్పారు. ఇచ్ఛాపురం మండలంలో పీఎం కిసాన్ 20వ విడత కింద 3715 మంది అర్హులైన రైతులకు రూ.74.3 లక్షలు, అన్నదాత సుఖీభవ మొదటి విడత కింద 6776 మంది రైతులకు రూ.338.8 లక్షలు జమ చేయబడ్డాయి. 6776 మంది రైతులకు రూ.413.1 లక్షలు నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అయ్యాయన్నారు. ఈ నిధులు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగు పనుల నిర్వహణకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని, ప్రతి అర్హ రైతుకూ అర్హమైన పథకాల మద్దతు అందించేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రైతులు తమ బ్యాంక్ ఖాతాలను పరిశీలించి, నిధులు జమ అయ్యాయా లేదో నిర్ధారించు కోవాలని సూచించారు. ఎవరైనా నిధులు అందుకోకపోతే సంబంధిత గ్రామ వీఏఏ సంప్రదించాలని కోరారు.

## బాధ్యత తీరింది.. భవనం అదిరింది..!

**-ఎంతో బాధ్యతగా వ్యహరించాం**

**-విద్యార్థులు ఉత్తములుగా తీర్చిదిద్దాలి**

**-ఎస్ఆర్ఎస్ఎంజడ్పీహెచ్ఎస్‌ను ఆదర్శంగా నిలపాలి**

**-ఐకానిక్ భవనాల తాళాలు హెచ్ఎంకు అందజేసిన కమిటీ**

**మందస, ఆగస్టు 2(వార్త):** ఎంతో బాధ్యతతో వ్యవహరించాం.. పూర్వ విద్యార్థులు, దాతలు సాయం మరువలేనిది..అనతికాలంలోనే అనుకున్నదాని కంటే బాగానే మన విద్యాలయాన్ని పునఃనిర్మించాం. రాష్ట్రంలోనే ఈ పాఠశాలకు అత్యున్నత స్థానం.. ఎంతో చరిత్ర కలిగిన పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని మందస హైస్కూల్ ఓల్డ్ బిల్డింగ్ రిస్టోరేషన్ ఫోరం ప్రతినిధులు కోరారు. ఓ మహా యజ్ఞాన్ని తలపించేలా.. 125సంవత్సరాల చరిత్ర కలిగిన మందసలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐకానిక్ భవనాలను యథాస్థితికి తీసుకురాగలిగాం.. చేతనైనంతవరకు పూర్వ విద్యార్థులు, దాతలు చేసిన సాయం మరువలేనిదని వారు పేర్కొన్నారు. శ్రీశ్రీనివాసరాజమణిదేవ మహరాజ్ హయాంలో 1901వ సంవత్సరంలో శ్రీరాజా శ్రీనివాసస్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మితమయ్యింది. అయితే, ఈ విద్యాలయం ముందు భాగంగా రాజుల చరిత్రను నెమరు వేసేలా భవనాలు ఉండేవి. వీటిని ఐకానిక్ భవనాలుగా స్థానికులు పిలుచుకునేవారు. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నారు. దీంతో మందసకు చెందిన ప్రొఫెసర్, డాక్టర్ పట్నాల మోహనరావుఆచారి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల కమిటీగా ఏర్పడి, విద్యాలయం పునఃనిర్మాణానికి సంకల్పించారు. ఈ బృహత్తర కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారు. లక్షలాది రూపాయలు సాయం చేశారు. ఎంతోమందిని ఉన్నతులుగా తీర్చి దిద్దిన ఈ విద్యాలయానికి ప్రస్తుతం పూర్వ వైభవం వచ్చింది. కళకళలాడుతోంది. ఈ తరుణంలో ఐకానిక్ భవనాలకు సంబంధించిన తాళాలను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుకు ప్రొఫెసర్ డాక్టర్ పట్నాల మోహనరావుఆచారి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుశాంత్ కుమార్ రౌళో, దుర్గాప్రసాద్ పాణిగ్రాహి, శానాపతి కిషోర్ కుమార్, మల్లారెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.



## బిడిమిలో పోలీసుల పల్లెనిద్ర

**మందస, ఆగస్టు 2(వార్త):** మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలో పోలీసులు పల్లెనిద్ర నిర్వహించారు. కాశీబుగ్గ డీఎస్పీ వై.వెంకటప్పారావు, కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుపతిరావు, మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతియుత వాతావరణం ఉండాలన్నారు. చిన్న, చిన్న వివాదాలను పెద్దవిగా మార్చవద్దన్నారు. నేరాలను నియంత్రించడంలో భాగంగా పల్లె నిద్రను గ్రామాల్లో చేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలను కూడా తెలుసుకుంటున్నామన్నారు. మహిళలను గౌరవించాలని, ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి అమ్మకాలు, సేవించడం తీవ్రంగా పరిగణిస్తామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. పోలీసులు ప్రజల స్నేహితులని, పోలీసుల సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546